క్లుప్తంగా

నిబంధనల మేరకు పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ఉపాధి హామీ పథకం పనులను నిబంధనల మేరకు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంకుడు గుంతలు, గోకులాలకు సంబంధించి అంచనాలు వేగంగా నమోదు చేయాలన్నారు. ఎక్కువ మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీలకు ఈ శ్రమ బీమా పథకంలో పేర్లు నమోదు చేపట్టాలన్నారు. ఏపీఓ సత్యనారాయణ, కార్మిక శాఖ అధికారి పి.సుధ, సిబ్బంది రామకృష్ణ, శేషగిరి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాను ఆరాధించాలి



అనపర్తిలో షిరిడీ సాయినాథునికి పూజలు చేస్తున్న రెడ్డి సురేష్‌శర్మ

అనపర్తి: విజయ దశమి రోజున షిరిడీ సాయిబాబా వారిని తప్పకుండా ఆరాధించాలని అనపర్తి సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి సురేష్‌శర్మ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతు ఈ ఏడాది విజయ దశమి, షిరిడీ సాయిబాబా వారి పుణ్య తిథి మహోత్సవం కూడా గురువారం కలసి వచ్చాయన్నారు. ప్రతి ఒక్కరూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకూ సాయిబాబా పారాయణ చేయాలని పిలుపునిచ్చారు. రామవరం చెరువు వీధిలో దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చెల్లపిళ్ల త్రిమూర్తిశర్మ వారి కుమారులు వెంకటశాస్త్రి, పవన్‌శర్మల ఆధ్వర్యంలో పూజలు చేశారు.



సంపరలో అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న అద్దంకి ముక్తేశ్వరరావు దంపతులు



జి.మామిడాడలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు



బలభద్రపురంలో సువాసిని పూజల్లో పాల్గొన్న మహిళలు

అమ్మవు నీవే.. అఖిల జగాలకు..

- భక్తిశ్రద్ధలతో దసరా నవరాత్ర ఉత్సవాలు
- కిటకిటలాడిన ఆలయాలు

పెదపూడి: అఖిల జగాలకు.. అమ్మవు నీవే అంటూ ఆ కనకదుర్గమ్మను భక్తులు కొలిచారు.. దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జి.మామిడాడలోని మణికంఠ స్వామివారి ఆలయం వద్ద కనక దుర్గాదేవిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకుడు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పదో రోజు కనక దుర్గాదేవిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో దుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. సంపరలో అమ్మవారికి 108 బిందెల నదీ జలాలతో అష్టోత్తర కలశ పూజలు, అభిషకాలను ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, రాజమహేంద్రవరం సిటీ, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు, నాగరాణి దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని మహిషాసురమర్దినిగా అలంకరించి కుంకుమార్చనలు చేశారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి, రాజరాజేశ్వరీ అమ్మవారిని, సంతోషి మాత ఆలయం వద్ద, కొమరిపాలెం, ఊలపల్లిలో కనకదుర్గమ్మను మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. బలభద్రపురం, కొంకుదురు, తొస్సిపూడి, ఆరికరేవుల, రంగాపురం గ్రామాల్లో కుంకుమ పూజలు చేశారు. పందలపాక శెట్టిబలిజపేటలో దుర్గమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిరిడీ సాయి మందిరంలో సువాసిని పూజ నిర్వహించారు. 10 మంది మహిళలను దేవతా రూపాలుగా ఉంచి పూజలు చేశారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల వీరవెంకట కృష్ణ పురుషోత్తమరెడ్డి, కమిటీ సభ్యుడు సత్తి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంపరలో అష్టోత్తర కలశ పూజల్లో పాల్గొన్న భక్తులు



బిక్కవోలులో మహిషాసుర మర్దినిగా కనకదుర్గమ్మ వారు

నేడు చండీ హోమం

బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయిబాబా మందిరం చండీ హోమం నిర్వహించనున్నట్లు మందిర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు. గురువారం విజయదశమిని పురస్కరించుకుని ఆలయంలో శ్రీచక్ర స్వరూప రాజరాజేశ్వరీదేవి అమ్మవారి సమక్షంలో చండీ హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉన్నాయన్నారు. అలాగే మధ్యాహ్నం 1 నుంచి 2.30 గంట వరకూ బాబా మహా సమాధి చెందిన సమయంలో దీపాలు వెలగించే కార్యక్రమం ఉంటుందన్నారు.

రంగంపేట మండలంలో..

రంగంపేట: స్థానిక దేవీ సెంటర్, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించారు. అమ్మవారికి ఆలయ అర్చకుడు నాగేంద్రశర్మ ప్రత్యేక పూజలు చేశారు. చంద్రేడులో కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయం, శ్రీదేవి కనకనదుర్గ ఆలయంలో అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించారు. ఉదయం అభిషేకాలు జరిగాయి. భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దొంతమూరులోని ప్రధాన రహదారిలో విజయదుర్గాదేవి ఆలయం వద్ద అమ్మవారికి అర్చకులు వెంకటేశ్వర్లు అభిషేకాలు, పూజలు చేశారు. ఈలకొలనులో ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వడిశలేరులో ఏడీబీ రోడ్డు పక్కన విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. నల్లమిల్లి, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్న సమారాధనలు జరిగాయి.

అనపర్తి: భవానీ మాలధారులకు పొలమూరు ఓంశక్తి సత్సంగం ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. స్థానిక దేవీ సెంటర్‌లో విజయదుర్గమ్మ ఆలయం వద్ద ఏటా భవానీ మాలధారులకు మధ్యాహ్నం సమయంలో భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. అనపర్తి పరిసర ప్రాంతాల నుంచి రోజు సుమారు 800 మందికి పైగా మాలధారులు విచ్చేసి అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారని సత్సంగం అధినేతలు గొలుగూరి విజయలక్ష్మి, మల్లిడి వీరరాఘవరెడ్డి తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన నల్లమిల్లి దేవిరెడ్డి, శేషయ్యమ్మ దంపతులు, తాడి అమ్మిరెడ్డి, ధనలక్ష్మి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు.



రంగంపేటలో మహిషాసురమర్దినిగా..



చంద్రేడులో మహిషాసురమర్దినిగా..

అలరించిన నృత్య రూపకం



మహిషాసురమర్దిని నృత్య రూపకంలో ఓ ఘట్టం

అనపర్తి: స్థానిక మహాలక్ష్మీపేటలో కనకదుర్గమ్మ వారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారుల ఆధ్వర్యంలో మహిషాసురమర్దిని నృత్య రూపకం ఆకట్టుకుంది. నవదుర్గలుగా చిన్నారులు వేషధారణ అబ్బురపరిచింది. అలాగే రేష్ డ్రైవింగ్ అనే సందేశాత్మక రూపకం ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. వీటితో పాటు జానపద నృత్యాలు చేశారు. చిన్నారులకు శిక్షణ ఇచ్చిన నీల శ్రీనివాసు మాస్టార్‌ను ఆలయ కమిటీ, ట్రావెలింగ్ బాయ్స్ యూత్ సభ్యులు, పెద్దలు అభినందించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వైబీఎస్ ఆచార్యులు వ్యవహరించారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

దాడి ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు

కోరుకొండ: గాడాలలోని మద్యం దుకాణం వద్ద దళిత యువకుడు పాముల శ్రీనుపై దాడి చేసిన ఘటనలో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం మధురపూడి ఎయిర్‌పోర్టు వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. గాడాలలో పాముల శ్రీనును పలువురు యువకులు తీవ్రంగా కొట్టారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేశామని, మరికొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. దళితులు, బలహీన వర్గాలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కోరుకొండ సీఐ సత్యకిషోర్ పాల్గొన్నారు.

హేయమైన చర్య

పాముల శ్రీనుపై దాడి హేయమైన చర్య అని గుమ్ములూరు సర్పంచ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సక్కా రాంబాబు, కోరుకొండ ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. దళితులకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దళితుడనే చులకన భావంతోనే శ్రీనును చెట్టుకు కట్టి తీవ్రంగా కొట్టారన్నారు. నిందితులకు రాజకీయ నాయకుల అండ ఉండడంతోనే అగ్రవర్ణాలు దాడికి పాల్పడ్డాయని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేపట్టాలి

పెదపూడి: జి.మామిడాడలో గురువారం ఉదయం 9.41 గంటలకు వారాహిమాత విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ఆ పూజలు భక్తిశ్రద్ధలతో చేపట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆ గ్రామంలో వారాహి మాత విగ్రహ ప్రాణప్రతిష్ఠ సంకల్ప పూజలు రెండో రోజు బుధవారం ఘనంగా జరిగాయి. దీనికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు హాజరయ్యారు. మహాచండీ హోమం, జలాధివాసం తదితర ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ మేడపాటి తాతారెడ్డి, కో కన్వీనర్ ద్వారంపూడి శ్రీనివాసురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సత్తి భగవాన్‌రెడ్డి, ప్రతినిధులు డీఆర్‌కే రెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, సిద్ధార్థ సత్తిరెడ్డి, డీవీ కృష్ణారెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



జి.మామిడాడలో హోమ పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

రేపు వేంకటేశ్వరస్వామి కల్యాణం

రంగంపేట: మండలంలోని చంద్రేడు గ్రామంలో కొలువైన పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఈ కల్యాణం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

కాల్‌మనీ పాపం ఎమ్మెల్యేదే..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్ర వ్యాప్త ఖ్యాతి గాంచిన అనపర్తి ప్రాంతానికి కాల్‌మనీ మచ్చను అంటించిన పాపం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిదేనని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఒక యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు. ఫైనాన్స్ వ్యాపారుల పట్ల రామకృష్ణారెడ్డి ఎంతో ప్రేమ ఉన్నట్టు మాట్లాడారని, నిజానికి 2014–19లో ఎమ్మెల్యేగా ఉన్న కాలంలోనే కాల్ మనీ కేసుల పేరిట ఫైనాన్స్ వ్యాపారులను వేధించడమే కాక, రాజకీయ వ్యతిరేకుల ఇళ్లపై పోలీస్ రైడ్‌లను జరిపించారని సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన అరాచకాలతో భయభ్రాంతులకు గురైన ఫైనాన్స్ వ్యాపారులు లక్షల విలువైన రికార్డులను కాలువల్లో పడేయాల్సి వచ్చిందని, ఆ చర్యలతో అనేక మంది తీవ్ర నష్టాలను చూశారన్నారు. ఫైనాన్స్ వ్యాపారులు తమ సమస్యలపై చర్చించడానికి సభ పెట్టాలని ప్రయత్నించగా, ఆ మీటింగ్‌లు జరగకుండా రామకృష్ణారెడ్డి అనుచరుల ద్వారా బెదిరింపులు జరిగాయని గుర్తు చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆ రోజుల్లో తీసుకున్న నిర్ణయాలతో వ్యాపారుల పరిస్థితి దారుణంగా మారిపోయిందన్నారు. ప్రజలు అప్పటి అరాచకాలను ఎప్పటికీ మరిచిపోరని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

అత్యంత అవినీతి ఎమ్మెల్యే ఆదిరెడ్డి

- ప్రతి శాఖ నుంచి కమీషన్లు
- మాజీ ఎంపీ భరత్‌రామ్ ధ్వజం


రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అత్యంత అవినీతి ఎమ్మెల్యేగా నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మొదటి వరుసలో నిలుస్తారని, తన అనుచరులతో కలసి ప్రతి పనికీ కమీషన్లు తీసుకుంటున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో 10, 15 అడుగుల నిడివి గల వీధుల్లో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, దానికి ఎమ్మెల్యే అండ దండలున్నాయని అన్నారు. అనుమతి ఇచ్చిన దాని కంటే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జులు రూ.లక్షలకు లక్షలు అదనపు ఫ్లోర్‌ల కోసం బహిరంగంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాటికి ఒక్క నోటీసు కూడా వెళ్లలేదని, ఆన్‌లైన్‌లో చూస్తే తెలుస్తుందన్నారు. ఇంత పెద్ద నగరానికి మున్సిపల్ కమిషనర్‌ను వేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. నగరంలో ప్రతి శాఖలో ఎమ్మెల్యే మనుషులు తిష్ట వేసుకుని కూర్చుంటున్నారన్నారు. అక్కడున్న వ్యక్తులు కమీషన్లు వసూలు చేస్తున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం అనుమతులు రాకపోతే ఎవరూ లంచాలు ఇవ్వొద్దని, అవసరమైతే మీ తరపున పోరాడతానని భవన నిర్మాణ దరఖాస్తుదారులకు భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. గడిచిన మూడు, నాలుగు నెలల్లో 189 మందికి అనుమతులు ఇవ్వలేదని తెలుస్తోందన్నారు. అధికారులు ఎం బుక్‌లు సిద్ధంగా పెట్టుకోండి.. జగనన్న ప్రభుత్వం రాబోతోంది.. ఏ ఒక్క ఎం బుక్కు మిస్సవ్వకుండా చూడండి, అన్నీ పరిశీలిస్తామని అన్నారు. నగరంలో చేసే అభివృద్ధి పనుల్లో నాణ్యత కరవవుతుందని, నామినేషన్ పనులు తక్షణం ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. గౌతమీ సూపర్ బజార్ విషయంలో అప్పట్లో దుష్ప్రచారం చేశారని, అక్కడ ఇప్పుడు నిర్మాణం జరుగుతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారో తెలియడం లేదన్నారు. అనధికారికంగా మూడు, నాలుగు అంతస్తులు అక్కడ వేస్తున్నారన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మార్గాని భరత్‌రామ్

కనకదుర్గమ్మకు వెండి వడ్డాణం సమర్పణ

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన శ్రీదేవి కనకదుర్గమ్మ వారికి గ్రామానికి చెందిన భక్తులు వెండి వడ్డాణం (బంగారం కోటింగ్) సమర్పించారు. దీని విలువ రూ.18 వేలు అని ఆలయ అర్చకుడు కృష్ణ తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం వడ్డాణం అలంకరించారు. అదే విధంగా దుర్గాదేవి గర్భగుడిలో గ్రామానికి చెందిన భక్తులు రూ. 3 వేలతో రంగులు వేయించినట్టు వివరించారు.



కనకదుర్గమ్మ వారికి సమర్పించిన వడ్డాణం